రాహుల్ గాంధీ డిమాండ్తోనే దిగొచ్చిన కేంద్రం : డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

మేడ్చల్, మే 2 (ప్రజా స్వరం) : కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయం తీసుకొని చేపట్టడం హర్షించదగ్గ విషయమని మేడ్చల్ మల్కాజ్ గిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. కులగణనపై మేడ్చల్ పట్టణంలో హరివర్ధన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కులగణన కేంద్ర ప్రభుత్వం తీసుకోవ డానికి ముఖ్య కారణం రాహుల్ గాంధీ అని, భారత్ జోడో యాత్ర ద్వారా భారతదేశ వ్యాప్తంగా చేపట్టడం జరిగిందన్నారు. ఈ యాత్రలో వినతుల సందర్భంగా కులగణన చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం తెలంగాణ రాష్ట్రం నుండే కులగణన ప్రారంభమైందన్నారు. అప్పుడు కులగ ణను బీజేపీ నాయకులు వ్యతిరేకించారన్నారు. రాజ్యాంగానికి అనుగూనంగా కులగణనను చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అధేవిదంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ నేతలు

బీజేపీ నాయకులు

మేడ్చల్ / ఘట్ కేసర్, మే 2 (ప్రజా స్వరం) : ఘట్ కేసర్ జంక్షన్,ఎన్టీపీసీ అండర్ పాస్,అంకుశాపూర్ అండర్ పాస్,మైసమ్మ గుట్ట అండర్ పాస్ నిర్మాణాలకు రూ. 102 కోట్ల రూపాయల పనులకు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి లు తెలిపారు. మండల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇందుకు సహకరించిన కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారికి,ఇట్టి పనుల కొరకు అన్ని రకాలుగా సహకరించిన రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధి హోదాలో నిరంతరం మంత్రుల దృష్టికి, అధికారాలకు మరియు పార్లమెంటు లో ఇట్టి విషయంపై తన వాణిని వినిపించిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ లకు మా ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోబోతున్నారని అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదారాబాద్ మరియు వరంగల్ నగరాల మధ్య నిత్యం వేలాది వాహనాల రాకపోకల జరుగుతు న్నాయని వాటికి ఈ అభివృద్ధి పనుల ద్వారా ఎంతో ఉపయోగం ఉందాన్నారు. ఈ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఉన్న ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకునే వేలాది విద్యార్థుల రాకపోకలు సులభ తర్మవుతాయన్నారు.-ఇంతటి రద్దీ ప్రాంతాల్లో ఆయా కూడళ్లలో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలకు ఈ అభివృద్ధి పనులు ప్రమాదాలను నివారించే గొప్ప మార్పుకు నాంది పలికినట్లవుతుందాన్నారు.ఈ యొక్క అండర్ పాస్ లు,జంక్షన్ల అభివృద్ధి వల్ల హైవే పైన ప్రయాణించే ప్రయాణికులకు ట్రాఫిక్ తిప్పలు,ఈ ప్రాంతాల ప్రజలకు అభివృద్ధి వైపుకు దూసుకుపోయే అవకాశం మరింత పెరుగుతుం దన్నారు. ఈ ప్రయత్నంలో నాకు అండగా నిలిచిన స్థానిక అధికారులు బీజేపీ పార్టీ శ్రేణులకు కూడా నా యొక్క కృతజ్ఞతలని తెలిపారు.ఈ సమావేశంలో లో బీజేపీ నాయకులు దాసరి బాల నర్సింహ్మా యాదవ్, కట్ట మధుసూదన్ రెడ్డి, చెలక శ్రీధర్, అనిల్ గౌడ్, పవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

ఔటర్ రింగ్ పై కారు బో ప్రమాదం ఒకరు మృతి

రంగారెడ్డి, మే 2(ప్రజాస్వరం): ఇబ్రహీంపట్నం మండలం బొంగ్లూర్ ఎక్సిట్ 12 వద్ద ఓఆర్ఆర్ లో కారు బోల్తా పడింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బొంగుళూర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపైన ఎగ్జిట్ నెం-12 వద్ద ప్రమాదవశాత్తూ అదుపుతప్పి డివైడర్ ను ఢ్రైజ కారు డీకొట్టి బోల్తా పడింది. కారు నడుపుతున్న దండుగుల తిరుమలేష్ (30) అక్కడి కక్కడే మృతి చెందాడు. ఆదిభట్ల పోలీసులు . కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రాహీంపట్నం మార్చురికి తరలించారు.

కాంగ్రెస్ చేసిన బీసీ జనగణనకు శాస్త్రీయత లేదు

ఎంపి ఈటల

హైదరాబాద్, మే 2(ప్రజాస్వరం): తెలంగాణలో కాంగ్రెస్ చేసిన బీఈ కులగణనకు శాస్త్రీయత లేదు. బీసీ జనాభా తగ్గించి చూపించారని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. బీసీ సంఘాలు ఆ జనగణన బంగాళాఖా తంలో వేసాయి. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు జనగణన చేయలేదు కానీ ఇప్పుడు చేయాలని డిమాండ్ చేయడం సిగుచేటు. ఒడ్డు ఎక్కేదాక ఓడ మల్లన్న, ఎక్కాక బోడమల్లన్న అనేది కాంగ్రెస్ కి అలవాటు. మోదీ మాట ఇస్తే దేశమంతా నమ్ముతుంది. కేంద్రం చేసే కులగణన బీసీలలో రాజకీయ సామాజిక ఆర్థిక విద్యా పరంగా వరంగా మారుతుంది. నిజమైన సామాజిక న్యాయం అందిస్తున్న పార్టీ ఒక్క బీజేపీ మాత్రమే నని అయన అన్నారు.

నీట్' పరీక్షపై ఫేక్ ప్రచారం.. 120కి పైగా ఛానల్లపై చర్యలు!

హైదరాబాద్ ప్రతినిధి మే 2(ప్రజాస్వరం): నీట్ (యూజీ) 2025 పరీక్షను ఉద్దేశించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఎన్టీఏ చర్యలు తీసుకుంది. టెలిగ్రామ్‌లో 106, ఇన్‌స్టా గ్రామ్‌లో 16 సహా మొత్తం 120కి పైగా ఖాతాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఈ కేసులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు బదిలీ చేశారు. ఫేక్ ప్రచారం చేసిన ఖాతాలను తొలగించాలని సంబంధిత సోషల్ మీడియా సంస్థలకు సూచించారు.

నృసింహుని దేవాలయంలో తిరు నక్షత్ర మహోత్సవం

యాదగిరిగుట్ట మే 2(ప్రజాస్వరం) : తెలంగాణ తిరుప తిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం ఉదయం వైభ వముగా శ్రీ జగద్గురు రామానుజాచార్య తిరునక్షత్ర మహోత్సవము వైభవంగా నిర్వహించారు. దేవాల యము లో ప్రబంధ అధ్యాపకులచే సేవాకాలం గావించారు. సాయంత్రం రామానుజాచార్య ఆళ్వార్ సేవతో పురవీధుల్లో ప్రబంధ పారాయణంతో పురప్పాట్టు కనుల విందుగా నిర్వహించారు.

ఎమ్మెల్యే కాలనీలో కూల్చివేతలు

హైదరాబాద్, మే2 (ప్రజాస్వరం) : బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12 లోని ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను షేక్పేట రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్న షేక్ పేట రెవిన్యూ సిబ్బంది స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కాగా పలువురు ప్లాట్ల యజమానులు తమ ఇండ్ల వెనుక ఉన్న స్థలాలను ఆక్రమించి స్విమ్మింగ్ పూల్స్ గార్డెన్స్ సర్వెంట్స్ రూమ్స్ తదిత నిర్మాణాలు చేపట్టి నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. రెవెన్యూ శాఖ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ తొలగించి నట్లు గుర్తించిన అధికారులు వారి పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం ఆక్రమాలు తొలగించారు. ఈ సందర్భంగా ఇండ్ల యజమానులకు, అధికారులకు మధ్యన వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు ఎలా చేస్తారంటే కొంతమంది వాదించగా, ఫోటో ఆదేశాలు ఉన్నాయంటూ మరి కొంతమంది గొడవకు దిగారు.తమకు 2017లోనే 489 గజాల స్థలాన్ని ప్రభుత్వం నుంచి జీ వో 59 కింద క్రమబద్ధీ కరణ చేసుకున్నామని..245 గజాల స్థలం క్రమబద్ధీ కరణ కోసం దరఖాస్తు చేసుకున్నా.. రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారని విశ్రాంత చీఫ్ ఇంజనీర్ కరీముల్లా ఆవేదన వ్యక్తం చేశారు.కోర్టులో స్టే ఉన్న ప్పటికీ రెవెన్యూ సిబ్బంది కూల్చారని ఆరోపించారు. దీనిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని తెలిపారు.

8న హైడ్రా పిఎస్‌ను ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్ మే 2(ప్రజాస్వరం): :హైదరా బాద్ లో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతోంది. ఈ నెల 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పిఎస్ ను ప్రారంభించనున్నారు. హైదరాబాద్ లోని చెరువులు, పార్కులు కబ్జా కాకుండా వాటిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా కమిసన్ ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. హైడ్రా వచ్చి రాగానే.. పలు ప్రాంతాల్లో పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టిన అక్రమ కట్టడాలపై విరు చుకుపడింది. పలు చోట్ల అక్రమకట్టడా లను హైడ్రా కుప్పకూల్చింది.అయితే, హైడ్రాపై తొలుత పాజిటీవ్ వచ్చినా.. కొన్ని అక్రమ కట్టడాలని తెలిసినా.. ఎందుకు కూల్చడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదే క్రమంలో కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో హైడ్రా స్పీడ్ కు బ్రేకులు పడ్డాయి. ఇప్పుడు మళ్లీ హైడ్రా స్పీడ్ పెంచనుంది. హైడ్రా పిఎస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు భారీగా వచ్చే అవకాశం ఉంది. గతంలో వేరే పోలీస్ స్టేషన్లలో నమోదైన కబ్జా కేసులు కూడా హైడ్రా పోలీస్ స్టేషన్ కు బదిలీ కానున్నాయి. చెరువులు, కుంటలు, భూముల కబ్జా కేసులు ఇక నుండి హైడ్రా పోలీస్ స్టేషన్ లోనే నమోదు కానున్నాయి.

చిల్కమర్రిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటన

షాద్ నగర్, మే 2(ప్రజాస్వరం) : ఫరూక్ నగర్ మండలం చిల్కమర్రిలో రైతులు బరిగేల యాదయ్య, వెంకట్ రెడ్డిలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు.

నష్టపోయిన ప్రతి గింజకు నష్టపరిహారం. ప్రకృతి వైపరీ త్యాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇస్తాం. హుటాహుటిన వడగండ్లకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే శంకర్ ఆదేశాలు ఇచ్చారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదు కుంటుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి ఫరూక్ నగర్ మండలంలోని అనేక గ్రామాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. ఈ సమాచారాన్ని తెలు సుకున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హుటాహు టిన శుక్రవారం ఉదయమే నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఫరూఖ్ నగర్ మండలం చిల్కమరి గ్రామంలో గత రాత్రి వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చిలకమర్రిలో రైతులు బడికెల యాదయ్య, వెంకట్ రెడ్డి, చిలకమర్రి రవీందర్ రెడ్డిలను తదితరులను కలిసి పంట నష్టానికి గల కారణాలను రైతుల నుండి అడిగి తెలుసుకు న్నారు.నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదు కుంటామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికా రులు ప్రత్యేక దృష్టితో ప్రతి రైతు యొక్క నష్టపోయిన పంట నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ శాఖ ఏడి రాజారత్నం, ఏఈ నిశాంత్ కుమార్ తదితరులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఆరుగాలం కష్టించి రైతు సాగు చేసి, పండించిన పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షం వడగండ్ల వాన వలన రైతులు నష్టపోయి బాధపడుతున్నారని, నష్టపోయిన ప్రతి గింజకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంటలు నష్టపోవడం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ కార్యాచరణ అమలు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి, మే2 (ప్రజాస్వరం) :జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్ తో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై సమీక్ష నిర్వహిం చారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారుల కు సూచించారు. జిల్లాలో అధికంగా ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు ఉండాలని అన్నారు. పెద్దపల్లిలోని కూనారం జంక్షన్, కమాన్ జంక్షన్, బస్ స్టాండ్ జంక్షన్, మంథని ఫ్లైఓవర్ వద్ద సాధ్యమైన మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జంక్షన్లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు ప్రతిపాదన లు తయారు చేయాలని, అవసరమైన లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. జంక్షన్ల కంటే ముందు ఇరువైపులా అవసరమైన బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని రహదారి పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. లారీలు, ట్రాక్టర్ లు, భారీ వాహనాలు, కార్లకు ముందు వెనుక తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజీవ్ రహదారిపై అవసరమై న చోట పోలీస్, ఆర్.టి.ఓ అధికారుల సమక్షంలో రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రహదారి పై అవసరమైన చోట హై మాస్ లైటింగ్ కోసం ప్రతిపాదనలు

అందించాలని అన్నారు. రహదారిపై టర్నింగ్ దగ్గర వెంటనే రేడియం స్టిక్కర్లతో బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై విస్తృత ప్రచారం కల్పించాలని, జిల్లాలోని బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ లిమిట్ బోర్డులను, యాక్సిడెంట్ ఏరియాలో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్ , పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీలు రమేష్ , కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాష్, ట్రాఫిక్ సిఐ, ఎస్ఐ లు, సంబంధిత అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే2 (ప్రజాస్వరం) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.

సీతారాంపూర్ లోని ఐ.వి.వై పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఐ. వి. వై పాఠశాల సహకారంతో 40 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 30 రోజుల పాటు కంప్యూటర్ అప్లికేషన్స్ లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు వస్తే మరో బ్యాచిలో శిక్షణ ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో థియరీ, ప్రాక్టికల్స్ పై దృష్టిపెట్టి విజయవంతంగా కోచింగ్ పూర్తి చేయాలనీ సూచించారు. ఇప్పుడు నేర్చుకున్న నైపుణ్యం భవిష్యత్తులో ఎంతో ఉప యోగపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఐ.వి.వై స్కూల్ చైర్మన్ పసుల మహేష్, కో చైర్మన్ శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదు

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట , మే 2 (ప్రజాస్వరం) : యూజీ నీట్ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థులు హాల్ టికెట్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటో, 1 పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర ఏదేని ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకొని రావాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువు లను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించరని అన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మొత్తం 883 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను సమకూర్చడం జరిగిందని ఆర్టీసీ బస్సులను కూడా విద్యార్థులను సమయానికి పరీక్ష కేంద్రాలకు చేర్చేలా ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష అధికారుల నియామకం, శిక్షణ పూర్తయిందని విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఈటల, మల్లారెడ్డి

మేడ్చల్, మే2 ప్రజాస్వరం : ధాన్యం కొలుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లు సూచించారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్, కేశవరం, జగంగూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు ప్రారంభించారు. రైతాంగం పండించిన ప్రతి గింజను సొసైటీలోనే అమ్మాలని రైతులకు ఎంపి ఈటల రాజేందర్ సూచించారు. రైతులు దలారులను నమ్మి మోసపోకుండా సొసైటీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి దాన్యాన్ని అమ్మాలన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనసాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి తో కలిసి కొనుగోలు కేంద్రంను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

రాజకీయ రిజర్వేషన్లతోనే బీసీలకు న్యాయం

హైదరాబాద్, మే2 ప్రజాస్వరం : దేశంలో రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో తీవ్ర అన్యాయానికి గురయ్యామని పలువురు బీసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. 1935లో ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే అన్ని వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు ఉండేవని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు పాలూరి రామ కృష్ణయ్య అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం సోమా జిగూడలోని ఫ్రంట్ కార్యాలయంలో జరిగింది.

సోలార్ పవర్ ప్లాంట్ లో వ్యక్తి ఆత్మహత్య

వికారాబాద్, మే2 (ప్రజాస్వరం) పెద్దేముల్ లోని ఇందుర్ బీమ్ సోన్ సోలార్ పవర్ ప్లాంట్ లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు గోపాల్ పూర్ గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి గా గుర్తించారు. సోలార్ పవర్ ప్లాంట్ 7 సంవత్సరాలుగాటెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆత్మహత్య కు గలా కారణాలు తెలియాల్సి ఉంది

Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336.
Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:8008609999